# నీడ

అతను చేతిలో బ్రీఫ్‌తో ప్లాట్‌ఫాం మీద నిలబడ్డాడు.

ఓసారి తనచుట్టూ ఎవరెవరు నిలబడి ఉన్నారో వాళ్ళని బెదుర్తూ పరిశీలించి చూశాడు. పరిచయమున్న ముఖం ఒక్కటీ కన్పడలేదు. గుండెల్నిండా వూపిరి పీల్చుకున్నాడు. తనకు తెల్సిన వాళ్ళెవరూ లేకపోవడం తన అదృష్టమే అన్పించింది.

టైం చూసుకున్నాడు - మూడు గంటలు కావస్తోంది. మద్రాసు ఎక్స్‌ప్రెస్ బయల్దేరటానికింకా పది నిముషాల టైం ఉంది.

తన కంపార్ట్‌మెంట్ వైపు కదలబోయి మరలా ఆగిపోయాడు.. భయం - గుండెల్ని పిండేసే భయం - అపరాధిలా తను - ఆత్మన్యూనతా భావం కింద నలిగిపోతూ తను..

ఆ బోగీలో తనతో పాటు ప్రయాణం చేసే వాళ్ళు తనను గుర్తుపడ్తారేమోనన్న దిగులు...

బ్రీఫ్‌కేస్‌ని మరో చేతిలోకి మార్చుకున్నాడు. కర్చీఫ్ తీసి ముఖానికి పట్టిన చెమటని తుడుచుకున్నాడు. తన బోగీని రెండుసార్లు అట్నుంచి నడుస్తూ యధాలాపంగా చూస్తున్నట్లు లోపలికి చూశాడు. తెల్సిన ముఖంలా ఏదీ కన్పించలేదు.

అసహనం - అనీజీనెస్ - బుక్‌స్టాల్ వరకూ నడిచి ఆగిపోయాడు - అక్కడిదాకా ఎందుకు నడిచాడో అతనికో క్షణం అర్థం కాలేదు. అతనికి మ్యాగజైన్స్ చదివే అలవాటు లేదు. వెనక్కి తిరిగి వచ్చేద్దామనుకున్నాడు. ఎవరైనా తనని పరిశీలిస్తున్నారేమోనని అనుమానం వచ్చింది. చుట్టూ బిడియంగా చూశాడు. ఎవ్వరూ చూడటం లేదు. షాపువాడు తనని పిచ్చి వాడనుకుంటాడేమో. చిరాకు - ఇన్‌డెసిషన్.. అసంకల్పితంగానే జేబులో చేయి పెట్టాడు. ఐదు రూపాయల నోటు చేతిలో.. తన చేతివైపు వింతగా చూసుకున్నాడు. అది అదుపు లేకుండా వణుకుతోంది.

మరో ఐదు నిముషాల్లో రైలు కదుల్తుందని అనౌన్సర్ గొడవ గొడవగా చెప్తున్నాడు.

అతని కళ్ళలో భయం ఇప్పుడు స్పష్టంగా కన్పిస్తోంది.

ఓ వారపత్రిక కొనుక్కున్నాడు. ఏదో నిశ్చయించుకున్న వాడిలా వడివడిగా తన కంపార్ట్‌మెంట్ వైపు నడిచాడు. బోగీకి రిజర్వేషన్ చార్ట్ అంటించి ఉంది. దాన్ని చూడగానే అతని గుండె వేగంగా కొట్టుకుంది.

ఓ క్షణం దాని ముందు నిలబడి తనతో పాటే ప్రయాణం చేసే వాళ్ళ పేర్లు చదువుకున్నాడు. ఆ బోగీలో తను కాకుండా మరో ముగ్గురు పాసింజర్లు బాపట్ల వరకూ వచ్చేవాళ్ళున్నారు. వాళ్ళ పేర్లు రెండు మూడుసార్లు చదువుకున్నాడు. లక్ష్మమ్మ 56, అనసూయ 32, రామారావు 18. ఓ నిముషం ఆ పేర్లు తన మనోఫలకంమీద ఏమైనా జ్ఞాపకాల చిత్రాల్ని గీస్తాయోమోనని ఆలోచించాడు. అంతా బ్లాంక్‌గా ఉంది. ఏమీ గుర్తుకు రాలేదు. అయినా ఏదో మూల అనుమానం చెద పురుగులా - తొలుస్తూ..

ట్రైన్ కదులుతుండగా గబుక్కున బోగీలోకి ఎక్కాడు. గుండె రైలింజన్‌లా..

తలుపు దగ్గరే నిలబడ్డాడు. సికింద్రాబాద్ స్టేషన్లో ఎక్కే వాళ్ళలో తనకు తెల్సిన వాళ్ళెవరైనా ఉంటారేమోనన్న ఆలోచన బోల్డంత అశాంతిని కలుగచేస్తోంది.

బ్రీఫ్‌కేస్‌ని ఓ క్షణం కింద పెట్టాడు. అది పడిపోకుండా కుడికాలు సపోర్ట్ చేశాడు. మరలా ఒంగి బ్రీఫ్‌కేస్‌ని తీసుకున్నాడు. కుడిచేతిలోంచి ఎడమ చేతిలోకి మార్చుకున్నాడు.

అసహనం... బెదురు...భయం.... జేబులోంచి టికెట్ తీసి బెర్తు నెంబరు చూసుకున్నాడు. కిటికీలోంచి చూస్తూ నిలబడ్డాడు. బెర్తు నెంబరు గుర్తుకురాలేదు. మరలా టికెట్ తీసి చూసుకున్నాడు. కొద్దిసేపు బెర్తునెంబర్‌ని మననం చేసుకున్నాడు.

అలా నిలబడటం కూడా చిరాగ్గానే ఉంది. అసలు అతను బయల్దేరిన క్షణంనించీ చిరాగ్గానే ఉన్నాడు.

బాపట్ల వెళ్లను మొర్రో అని మొత్తుకున్నా - లక్షసార్లుచెప్పినా అతని ఆఫీస్‌లో వినే నాధుడే లేకపోయాడు.

ఓవైపు భయం ఉన్నా మరో వైపు ధైర్యం కూడా లేకపోలేదు. తన భయం అర్థరహితమనీ

- ఇల్లాజికల్ అనీ - ఇరవై సంవత్సరాల క్రితం వదిలి వచ్చిన వూరు... ఇరవై సంవత్సరాలు.. ఎంతగా మారిపోయి ఉంటుందో... అక్కడి మనుషులు కూడా ఎక్కడెక్కడో స్థిరపడి ఉండి ఉంటారు.

అందుకే యిక తప్పదని తెలిసి బయల్దేరాడు.

తీరా బయల్దేరాక వణుకు ప్రారంభమైంది. వేల ఆలోచనలు.. వికృతంగా.. అస్పష్టమైన రూపాలెన్నో - భయంకరంగా...

సికింద్రాబాద్ స్టేషన్ వచ్చింది. ఫ్లాట్‌ఫాం అంతా సందడిగా ఉంది. కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కే ప్రతి వ్యక్తినీ అతను పరిశీలనగా చూస్తున్నాడు.

ఓ బట్టతలతను ఎక్కటం చూసి అతను భయంగా తలపక్కకు తిప్పుకున్నాడు. మొహానికి వారపత్రిక అడ్డం పెట్టుకున్నాడు.

ఆ బట్టతలతను తనకు తెలుగు చెప్పిన మాస్టారిలా ఉన్నాడు. వెనకనించి పరిశీలించి చూశాడు. అదే ఎత్తు.. అదే లావు... బట్టతల... కళ్ళద్దాలు..

ఓ క్షణం దిగిపోదామనుకున్నాడు. మరలా నిదానంగా ఆలోచించాడు. తన తెలుగు మాష్టారి వయసు అప్పుడు నలభై పైనే. అంటే ఇప్పుడతనికి అరవైపైనే ఉండాలి. ఇప్పుడు చూసినతనికి నలభై ఉంటాయెమో.... కాబట్టి తన మాష్టారు కావడానికి అవకాశం లేదు.

ఈ ఆలోచనతో కొద్దిగా ధైర్యం వచ్చింది. బ్రీఫ్‌కేస్ పట్టుకుని బెర్తుకోసం వెతుక్కుంటున్నట్లు ఆ బట్టతలాయన వెనక్కు నడిచాడు. అతన్ని దాటుకుంటూ ముందుకు వెళ్ళి - వెనక్కి తిరిగి అతన్ని పరీక్షిస్తూ చూశాడు. అచ్చం తన తెలుగు మాష్టారిలానే ఉన్నాడు.

అతనికి కొద్దిగా నవ్వొచ్చింది. ఇరవ్వయేళ్ళ క్రితం చూసిన మాష్టారు అలానే.. అదే వయసులో ఉండటం అసంభవం కదా - అనుకున్నాడు.

అతని కొడుకేమో... నన్న కొత్తరకం భయం ప్రారంభమైంది. ఆ భయంలో మొదట అతనికి గుర్తుకు రాలేదు. ఆ తెలుగు మాష్టారికి ఇద్దరూ కూతుర్లేనని - తర్వాత గుర్తొచ్చి కొద్దిగా స్థిమితపడ్డాడు.

మనసంతా దస్సిపోయినట్లు - నిస్త్రాణ..

ట్రైన్ సికింద్రాబాద్ స్టేషన్ నించి బయల్దేరింది.

వెతుక్కుంటూ వెళ్ళి సీట్లో కూర్చున్నాడు. తనది లోయర్ బెర్తు. దాని మీద ఇద్దరు ఆడవాళ్ళు ఓ అబ్బాయి కూచుని ఉన్నారు. వాళ్ళకెదురుగా కూచున్నాడు. అతని పక్కన కొత్తగా పెళ్ళయిన జంటలా ఉన్న ఓ ఆడామగాకూచున్నారు.

తన ఎదురుగా కూచున్న వాళ్ళే లక్ష్మమ్మ, అనసూయ అయి ఉంటారనుకున్నాడు. ఆ పక్కన ఉన్న కుర్రవాడు రామారావు అయి ఉంటాడు. వీళ్ళు ముగ్గురే తనతోపాటు బాపట్ల వరకూ వచ్చేది.

వీళ్ళ ముఖాలు ఎక్కడయినా తగిలినాయా అని పరిశీలనగా చూశాడు. గుర్తుకు రావటం లేదు.

ఎందుకయినా మంచిదని కొన్న పుస్తకం ముఖానికి అడ్డంగా పెట్టుకున్నాడు.

ట్రైన్ వేగం అందుకుంది.

ఎదురుగా కూర్చున్నావిడ జలపాతం హోరులా ఆపకుండా మాట్లాడ్తూ ఉంది. ఆమె పక్కన కూచున్న వాళ్ళు శ్రద్ధగా వింటున్నారు. బహుశా కూతురు కొడుకేమో.

ముఖం పుస్తకంలోనే దాచి వాళ్ళ మాటల్ని వినడానికి ప్రయత్నించాడు.

"పెద్దోడికి బుద్ధిలేదే అనసూయా.. పెళ్ళప్పుడు ఇరవై తులాల బంగారం ఇస్తామని చెప్పారా - పదిహేనే ఇచ్చారు. మిగతా అయిదూ అడగొద్దా? పెళ్ళాం కొంగట్టుకుని తిరుగుతాడు తప్ప ఆ విషయం కదల్చడేం?"

"కట్నం డబ్బులు కూడా కొంత బాకీ ఉన్నారు కదే అమ్మా".

"ఔనే.. మొన్న దాని అమ్మ వచ్చిందిగా - నాలుగు దులిపేశాను. నేను కొడుకుల్ని అమ్ముకుంటున్నానట. అన్నన్ని డిగ్రీలు వూరికే వచ్చాయా - ఎన్నెన్ని వేలు ఖర్చుచేసి చదివించలేదూ? అయినా మన బంగారం బాగుండాలి కదా.. ఎవర్నని ఏం ప్రయోజనం"

"అయినా ఆ అమ్మాయికి పొగరు బాగా ఉందమ్మా. ఒక్కోసారి నావైపు అదోలా



1381

చూస్తుంది గమనించావా - గుడ్లు మిటకరించి...."

బహుశా వదిన గురించి అయి ఉంటుందనుకున్నాడు. పుస్తకంలోంచి తలయెత్తివాళ్ళిద్దరివైపూ చూశాడు.

రామారావనే అబ్బాయి వాళ్ళ మాటల్ని శ్రద్ధగా వింటున్నాడు.

"వీడేం చేస్తాడోనే... వీళ్ళన్నలా పెళ్ళాన్నే రంభ అనుకుని ఆడంగి వెధవలా తిరుగుతాడో.... లేక.."

"నేను అన్నయ్యలా ఎప్పుడూ చేయనే అమ్మా - నిన్నూ అక్కనీ గౌరవంగా చూళ్ళేదా - దాన్ని మక్కెలిరగదంతా.." అన్నాడు.

"నీ అన్నకూడా పెళ్ళికి ముందు ఇలా అన్నవాడే" రాగాలు తీసింది వాళ్ళమ్మ.

తల్లికి తగ్గ కొడుకూ, కుతురూ అనుకున్నాడతను.

"అదేం వంట చేయటమే.... మాడ్చి మసి బొగ్గులా చేస్తుంది - రుచీపచీ ఉండదు. దానికి వాళ్ళమ్మ వంటా వార్పూ నేర్పినట్లు లేదు. ముంగిలా కన్పిస్తుంది కాని అమ్మో..." గుండెల మీద చేయి వేసుకుని కళ్ళింత పెద్దవి చేసి తల్లి వదిలేసిన టాపిక్ నిమరలా ఎగదోసింది.

"ఛీ - దాని వంట పాడుగాను - నేను ముద్ద ముట్టకోలేకపోయానంటే నమ్ము".

"మనకు పెట్టిన చీరలు కూడా చూశావా ఎంత నాసిరకంవో! - వీడుషాపింగ్ కెళ్తున్నప్పుడు తగుదునమ్మా అని వెంట ఎందుకెళ్ళిందనుకున్నావు? ఎక్కడ ఖరీదయినవి కొనేస్తాడోనని అదుపు చేయడానికి వెళ్ళింది.. నీ కర్థం కాలా.." దీర్ఘం తీసింది కూతురు.

"ఎందుక్కాలా.. దాన్ని ఓ కంట గమనిస్తూనే ఉన్నా... మిగతా పైకం, అయిదు తులాల బంగారం ఇవ్వకుండా ఉండాలి - అపుడు తెలుస్తుంది లక్ష్మమ్మ అంటే ఏమిటో".

ధారాపాతంగా మాట్లాడుకుంటూనే ఉన్నారు. ఆ కోడలు పిల్ల ఎవ్వరో - ఆమెని అన్ని యాంగిల్స్‌లోంచి డిసెక్ట్ చేస్తున్నారు.

అతను పుస్తకం అడ్డుపెట్టుకునే కొద్దిసేపు కళ్ళు మూసుకున్నాడు. మాగన్నుగా నిద్రపట్టింది.

"ఏ వూరెళ్ళాలండీ?" అనే ప్రశ్నకి ఉలిక్కిపడి లేచాడు. పుస్తకం జారి క్రింద పడింది. ఎవర్ని అన్నట్లు ప్రశ్నార్థకంగా చూశాడు.

లక్ష్మమ్మ అయి ఉంటుందనుకున్నాడు అడుగుతోంది "మిమ్మల్నే.... ఎందాక వెళ్ళాలి" అని.

"బాపట్ల" అన్నాడు ముక్తసరిగా.

"ఎక్కడుంటారు బాపట్లలో?"

"మాది బాపట్ల కాదండీ.. హైదరాబాద్. ఆఫీస్ పనిమీద వెళ్తున్నాను."

"బాపట్ల మీ సొంతూరు కాదా?... మిమ్మల్ని ఎక్కడో చూసినట్లు అన్పిస్తోంది" అంది గుచ్చి గుచ్చి చూస్తూ.

గతుక్కుమన్నాడతను.

"మీ చుట్టాలెవరైనా బాపట్లలో ఉన్నారా?" అని అడిగింది.

"లేరండి"! మరలా ముక్తసరిగా జవాబిచ్చాడతను. అతనికీ సంభాషణ కంటక ప్రాయంగా ఉంది. తను వూహించుకుని భయపడిన విషయాలు నిజాకృతిదాల్చి తన మీద దాడిచేస్తున్నట్లు.

"మాది స్వస్థలం బాపట్లే నాయనా - పుట్టి పెరిగిందీ - పెళ్ళీ అన్నీ అక్కడే.. నిన్నెక్కడో చూసినట్లు అనిపిస్తేనూ.." సంబోధన మీరు లోంచినీవు లోకి మారిపోవటం గమనించలేదతను.

సంభాషణ అక్కడితో ఆగినందుకు సంతోషిస్తూ అతను పుస్తకం మరలా అడ్డం పెట్టుకున్నాడు.

వరంగల్ వచ్చేవరకూ ఆమె కోడల్ని శల్య పరీక్ష చేయటంలో నిమగ్నమైపోయింది.

వరంగల్‌లో ఆమె కొడుకు దిగి గారెలు - మంచినీళ్ళు పట్టుకొచ్చాడు. వాటిని ఆబగా తింటూ మరలా అతనివైపు చూసింది.

"నిన్నెక్కడో చూశాను. ఆ బుగ్గమీద పులిపిరి కాయ నాకు బాగా గుర్తు" ఆలోచిస్తూ అంది.

అతను అనీజీగా కదిలాడు.

ట్రైన్ బయల్దేరింది.

లక్ష్మమ్మ మరలా కోడల్ని దుయ్యబట్టడంలో నిమగ్నమైంది

అతను హాయిగా వూపిరిపీల్చుకున్నాడు.

"ఆ గుర్తొచ్చింది. నీవు వెంకట్రామయ్య కొడుకువి కదూ?" అంది లక్ష్మమ్మ హఠాత్తుగా.

అతను పలకలేదు.

"నిన్నే - మీనాన్న పేరు వెంకట్రామయ్య కదూ" అంది.

"కాదండీ" అన్నాడు భయంభయంగా.

"కాకపోవడమేంటి. ఇపుడు బాగా గుర్తొస్తోంది. ఇరవై యేళ్ళ క్రితం నీకు పదేళ్ళుంటాయేమో. నీ బుగ్గమీద పులిపిరి కాయ నాకు బాగా గుర్తు. అచ్చం నీలాగే ఉండేవాడు మీ నాన్న ఆ రోజుల్లో - ఆ పులిపిరికాయ ఒక్కటే తేడా"

"మీరేం మాట్లాడుతున్నారో నాకు తెలియటం లేదండీ" అన్నాడతను ఇబ్బందిగా.

"అదేంటబ్బాయ్ - అలా అంటావు! మీ అమ్మే కదూ - వాళ్ళు కొవ్వెక్కి బంగారం లాంటి పిల్లల్ని, సంసారాన్ని వదులుకుని ఆ చేపలు పట్టే బెస్తవాడితో లేచిపోయింది! హవ్వ - ఆరోజుల్లో ఎంత విడ్డూరంగా చెప్పుకున్నారో.."

"మీరు పొరబడ్తున్నారండీ - మా అమ్మ నాతోపాటే హైదరాబాద్‌లో ఉంది" అన్నాడతను దిగులుగా ముఖం పెట్టి.

"ఎవరే అమ్మా - మనకు తెల్సిన వాళ్ళేనా" కుతూహలంగా అడిగింది కూతురు.

"తెలియకపోవటం ఏమిటే... మనింటి దగ్గరే ఉండేవాళ్ళు పాపం... ఎలాంటి కుటుంబం ఎలా చితికిపోయిందో.. సముద్ర తీరానికి ఏ షికారుకో వెళ్ళినపుడు - గోచీ మాత్రమే ఉన్న ఆ బెస్తవాడిని చూసి మోహించిందో ఏం పాడో - వీళ్ళమ్మ వాడితో లేచిపోయి ఆ గుడిశెల్లో కాపురం పెట్టింది. వీళ్ళ నాన్న అవమానం భరించలేక దూలానికి వురేసుకుని చచ్చిపోయాడు. ఈ అబ్బాయి యిల్లొదిలి ఎక్కడికో పారిపోయాడని చెప్పుకునేవాళ్ళు. నీవు మీ మామయ్య

వాళ్ళింట్లో ఉండి చదువుకో బట్టి నీకీ విషయాలు తెలియవు" అని అతని వైపు తిరిగి "ఏం నాయనా అపుడు ఇల్లొదిలి హైదరాబాద్ వెళ్ళిపోయావా" అంది లక్ష్మమ్మ జాలిగా.

"అయ్యో ఖర్మ నేను వెంకట్రామయ్య వాళ్ళబ్బాయిని కాదంటే వినరేం. మానాన్నగారి పేరు జానకిరాం. బ్రతికే ఉన్నారు" అన్నాడతను విసుగ్గా.

అతని విసురుకి, చిరాకుకి లక్ష్మమ్మ కొద్దిగా తగ్గింది.

అతని ముఖం నిండా చెమటలు పట్టాయి. ఇబ్బందిగా తన పక్కన కూచున్న కొత్త జంటవైపు చూశాడు. వాళ్ళిద్దరూ హిందీలో ఏదో మాట్లాడుకుంటూ వాళ్ళ ప్రపంచంలో ఉన్నారు.

లేచి బాత్‌రూం వరకూ నడిచాడు. అక్కడో పదినిముషాలు నిలబడ్డాడు.

ఎవరిమీదో కసి.. మనుషులందరి మీద అసహ్యం -

ప్రపంచాన్నంతా చుట్టగా చుట్టి సముద్రంలో విసిరేయాలన్నంత కోపం.

తన సీట్లో కెళ్ళి కూచోవడానికి మనసొప్పటం లేదు.

నిలబడేకొద్దీ చిరాకు ఎక్కువవుతోంది.

ఏదో స్టేషన్ వచ్చింది. ఏ స్టేషనో చూడాలన్న ధ్యాసకూడా లేదతనికి.

పళ్ళు పటపట కొరుక్కున్నాడు. ఏదో ఆకృతి లేని శాపం తనని వెన్నంటే ఉన్నట్లు.. తనను కబళించటానికి ఏదో శక్తి తరుముకుంటూ వస్తున్నట్లు...

ఓ క్షణం అంతులేని నిరాశ ఆవహించింది. భూమి పొరల్లోని ఏ చీకటి కోణంలో దాక్కున్నా ఈ భయం తనని వదలదనిపించింది.

వచ్చి సీట్లో కూచున్నాడు.

ఏదో మాట్లాడ్తున్న లక్ష్మమ్మ ఒక్కసారిగా మాటలు ఆపి అతని వైపు వింతగా చూసింది.

అందరూ తలలు తిప్పి తనవైపే చూస్తున్నారేమోనన్న అనుమానం అతనికి..

అతను అపరాధిలా తల వొంచుకుని కూచున్నాడు.

అతను కూచున్నాక లక్ష్మమ్మ అతన్ని ఉద్దేశించి అంది. "మీ నాన్న వురేసుకున్నాక -

నీవు పారిపోయి వెళ్ళిపోయాక మీ అక్క జీవితం ఏమైందో తెలుసా నాయనా... పాపం - పిచ్చిపిల్ల - మీ అమ్మ చేసిన తప్పుకి ఆ అమ్మాయి జీవితం ఘోరంగా బలైపోయింది. అసలే వయసులో ఉన్నదాయె - మీరిద్దరూ లేని ఒంటరిదైపోయి.."

విసురుగా లేచాడతను. అతని ముఖంలో రౌద్రం - కళ్ళు చింతనిప్పుల్లా మండుతున్నాయి. మనిషి ఆవేశంతో వణికిపోతున్నాడు.

అతని రూపం చూసి భయంతో కెవ్వుమని అరిచివెనక్కి తూలిపడింది లక్ష్మమ్మ.

అతను బ్రీఫ్‌కేస్ చేతిలో పట్టుకుని లక్ష్మమ్మ వైపోసారి క్రూరంగా చూసి కదిలాడు.

వెళ్ళి తలుపుదగ్గర నిలబడ్డాడు. అతని శ్వాస పాముబుసలా ఉంది.

తన వీపుకి వేలవేల చూపులు అతుక్కుపోయి పరిహసిస్తున్నట్లు... ఎగతాళి మిళితమైన నవ్వులు తనని పరిహరిస్తున్నట్లు...

వచ్చే స్టేషన్లో దిగి వేరే బోగీ ఎక్కుదాం అన్న ఆలోచన ఓ క్షణం - మరలా భయం.... తన మనసు మీద బలంగా పడిన లోహముద్ర కింద విలవిల్లాడుతూ తను.. తన గుండెల మీద విధి పొడిచిన క్రూరమైన పచ్చబొట్టులా...

స్టేషన్లో ట్రైన్ ఆగింది - గుంటూరు స్టేషన్. టైం చూసుకున్నాడు. పది కావస్తోంది. ఆఫీస్‌పని గుర్తొచ్చింది. తెగింపు... ఉద్యోగం పోయినా పర్లేదన్న తెగింపు.

మరో ఆలోచనలేకుండా దిగిపోయాడు.

హైద్రాబాద్ తిరుగు ప్రయాణానికి టికెట్ కోసం కౌంటర్‌వైపు నడిచాడు. అతను నడుస్తుంటే.... ప్లాట్‌ఫాంలోని ట్యూబ్‌లైట్ల కాంతికి అతని నీడపొడవుగా సాగి... అతనితోపాటే కదిలింది....

● మయూరి వీక్లీ 23 జులై, 1993 ●